

## ఉచిత న్యాయ సహాయం కోసం టోల్‌ఫ్రీ నంబర్ 15100

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 4 : ప్రతి ఒక్కరికీ ఉచిత సమ న్యాయం అందించాలనే ఉద్దేశంతో టోల్‌ఫ్రీ నంబర్ 15100 అన్ని వేళల్లో అందుబాటులో ఉంటుందని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీ చంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉచిత న్యాయ సహాయం పొందాలనుకునేవారు ఈ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయవచ్చని ఆమె సూచించారు.

# రాష్ట్రస్థాయి డ్యూటీమీట్‌లో ప్రతిభ చాటాలి

## మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ




సమావేశంలో మాట్లాడుతున్న మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 4 : పోలీసుల ప్రతిభను వెలికితీయడానికి పోలీస్ డ్యూటీమీట్ ఉపయోగపడుతుందని మల్టీజోన్-2 ఐజీ వి.సత్యనారాయణ పేర్కొన్నారు. సంగారెడ్డిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు చెందిన పోలీసు అధికారులకు జోనల్‌స్థాయి డ్యూటీ మీట్ ఎంపికలు నిర్వహించారు. గత నెల జరిగిన జిల్లాస్థాయి డ్యూటీమీట్‌లో ప్రతిభ కనబర్చినవారిని జోనల్ స్థాయి డ్యూటీమీట్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్యాప్తులో మెళకువలను డ్యూటీమీట్ ద్వారా నేర్చుకోవచ్చన్నారు. జోనల్‌స్థాయి డ్యూటీ మీట్‌లో ఎంపికైనవారిని ఈ నెల 14 నుంచి 18 వరకు జరిగే రాష్ట్రస్థాయి డ్యూటీమీట్‌కు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రూపేష్, అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు, జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరేందర్, వికారాబాద్ డ్యూటీమీట్ నోడల్ అధికారి వీరేష్, ఎస్‌డఅ ఇన్‌స్పెక్టర్ విజయకృష్ణ, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.





సంగారెడ్డిలో టార్చ్‌ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ క్రాంతి

## టార్చ్ ర్యాలీకి ఘన స్వాగతం

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, అక్టోబరు 4 : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించబడిన సీఎం కప్-2024 టార్చ్ ర్యాలీ శుక్రవారం సంగారెడ్డి జిల్లాలో ప్రవేశించింది. కలెక్టర్ వల్లూరు క్రాంతి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి ర్యాలీకి స్వాగతం పలికారు. సీఎం కప్ గురించి ప్రజల్లో అవగాహన కల్పించడమే టార్చ్ ర్యాలీ ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో సీఎం కప్ కాన్వాయ్ ఇన్‌చార్జి సీఐ మధు, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు జావిద్‌అలీ, కలెక్టరేట్ ఏవో పరమేశ్, డీవైఎస్‌వో ఖాసింబేగ్, యువజన సంఘాల అధ్యక్షుడు కూన వేణు పాల్గొన్నారు. అనంతరం మెదక్ జిల్లాలో ప్రవేశించిన ర్యాలీకి జిల్లాకేంద్రంలోని వెల్‌కమ్‌బోర్డు వద్ద ర్యాలీకి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఎస్పీ ప్రసన్నకుమార్, డీవైఎస్‌వో దామోదర్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ధ్యాన్‌చంద్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

## మూడోరోజు వెరిఫికేషన్

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, అక్టోబరు 4 : డీఎస్సీ-2024 అభ్యర్థుల సర్టిఫికేషన్ వెరిఫికేషన్ ప్రక్రియ మూడోరోజు శుక్రవారం సజావుగా జరిగింది. సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో నిర్వహించిన వెరిఫికేషన్ ప్రక్రియలో అన్ని కేటగిరీల అభ్యర్థులు 908 మంది హాజరయ్యారని డీఈవో ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 197 మంది, ఎస్జీటీ విభాగంలో 663 మంది, ల్యాంగ్వేజ్ పండిత్‌లు 38 మంది, పీఈటీలు 10 మంది హాజరైనట్లు వివరించారు.



మెదక్‌లో వెరిఫికేషన్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

అలాగే మెదక్‌లోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో కొనసాగుతున్న సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఇప్పటివరకు ఎస్ఏ, ఎస్జీటీ, తెలుగు, హిందీ పండిత్, పీఈటీ అభ్యర్థులు 618 మంది అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిందని తెలిపారు. నేడు సర్టిఫికెట్ల పరిశీలనకు చివరి రోజు అని మెదక్ డీఈవో రాధాకిషన్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

### సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి, ఎస్పీ చెన్నూరి రూపేష్

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 4 : జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. ఎస్పీ చెన్నూరి రూపేష్‌తో కలిసి శుక్రవారం ఆమె సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలు గుర్తించి, భద్రత ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రమాదాల నివారణకు అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రమాదాలను నియంత్రించాలంటే అతివేగంగా వాహనాలను నడపకుండా నియంత్రించాలని ఎస్పీ సూచించారు.

# దుబ్బాక దుమారం



- గత నెల మంత్రి సురేఖ పర్యటనతో బీజం
- ఆమెకు నూలు దండ వేసిన ఎంపీ రఘునందన్
- ఇద్దరి ఫొటోపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం
- ఫొటోను చూపిస్తూ కన్నీటి పర్యంతమైన సురేఖ
- కేటీఆర్‌ను విమర్శిస్తూ నాగార్జున కుటుంబంపై వ్యాఖ్యలు
- మంత్రి సురేఖ తీరును ఖండిస్తున్న సినీ ప్రముఖులు
- రాష్ట్ర రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా దుబ్బాక సీన్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, అక్టోబరు 4 : ప్రస్తుతం రాష్ట్రంలో ఎవరి నోట విన్నా, ఎక్కడ చూసినా సినీ, రాజకీయ వర్గాలకు సంబంధించిన చర్చనే జరుగుతోంది. రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలకు బీజం పడింది సిద్దిపేట జిల్లా దుబ్బాకలోనే. ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి హోదాలో సెప్టెంబరు 26న ఆమె దుబ్బాకకు విచ్చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన మెదక్ ఎంపీ రఘునందన్‌రావు చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రి కొండా సురేఖకు నూలుదారాలతో అల్లిన దండను వేసి సన్మానించారు. ఈ దండ వేస్తున్న




దుబ్బాకలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖకు నూలు దండ వేసిన ఎంపీ రఘునందన్‌రావు (ఫైల్)

ఫొటోపై సోషల్‌మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని మూడు రోజుల తర్వాత సురేఖ కన్నీటి పర్యంతం కావడం చర్చనీయాంశంగా మారింది. కాలక్రమేణా ఈ విషయం తీవ్ర పరిణామాలకు దారి తీసింది. దుబ్బాక పర్యటన ఫలితంగా రాజుకున్న ఈ వివాదం తారాస్థాయికి చేరింది. ప్రస్తుతం సినీ, రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

### ఆరోపణలు..ఉపసంహరణలు..కేసులు

దుబ్బాక పర్యటనకు సంబంధించిన ఫొటోపై సోషల్‌మీడియాలో అసత్య ప్రచారం చేశారని, దీని వెనుక కేటీఆర్ ఉన్నారని మంత్రిగా ఉన్న సురేఖ కన్నీటిపర్యంతమై చెప్పడంతో వివాదం మొదలైంది. దీనిపై కేటీఆర్ చిట్‌చాట్‌లో పలు వ్యాఖ్యలు చేశారు. ఇందుకు స్పందించిన సురేఖ విరుచుకుపడ్డారు. కేటీఆర్‌ను టార్గెట్ చేసే క్రమంలో సినీ నటుడు నాగార్జున కుటుంబంపై పలు ఆరోపణలు చేశారు. నాగార్జున కుమారుడు హీరో నాగచైతన్య, హీరోయిన్ సమంత విడాకులకు కేటీఆర్ కారణమంటూ బాంబు పేల్చారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఇటు బీఆర్ఎస్ మహిళా నేతలు, నాగార్జున కుటుంబ సభ్యులు, సమంత, సినీ ప్రముఖులు ఈ వ్యాఖ్యలను దారుణంగా ఖండించారు. సురేఖ సైతం తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్లు చెప్పాల్సి వచ్చింది. అయినప్పటికీ కేటీఆర్ ఆమెకు లీగల్ నోటీసు పంపించగా.. నాగార్జున ఏకంగా పరువు నష్టం దావా వేశారు. ఇక దుబ్బాకకు సంబంధించిన ఫొటోను దుష్ప్రచారం చేయడం వెనుక కేటీఆర్, హరీశ్‌రావు ఉన్నారని ఎంపీ రఘునందన్‌రావు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఇక గురువారం దుబ్బాకకు వచ్చిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కాన్వాయ్‌పై కాంగ్రెస్ కార్యకర్తలు కోడిగుడ్లతో దాడి చేయడం వెనుక ఇదే కారణం ఉంది. దీనిపై ఎమ్మెల్యే తీవ్రంగా మండిపడ్డారు. విచారణ జరిపి ఫొటోపై దుష్ప్రచారం చేసినవాళ్లను శిక్షించాలే తప్ప ఇలా వ్యవహరించడం సరికాదన్నారు.

### ముదిరేనా.. సమసేనా..!

హాట్‌హాట్‌గా మారిన కొండా సురేఖ వ్యాఖ్యల ప్రభావం నేటికీ చల్లారడం లేదు. దీనిపై సినీ రంగంలోని ప్రముఖులంతా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ నేతలతోపాటు బ్యూరోక్రాట్లు సైతం ఖండిస్తున్నారు. ఆమె తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నా అని చెప్పినప్పటికీ వివాదం మాత్రం రాజుకుంటూనే ఉంది. అక్కినేని కుటుంబ సభ్యులకు, సమంతకు మద్దతుగా పలు వర్గాలవారు నిలుస్తున్నారు. తాను కేటీఆర్‌ను మాత్రమే విమర్శించానని, నాగార్జున కుటుంబాన్ని కాదని మంత్రి సురేఖ స్పష్టంగా చెప్పుకొస్తున్నారు. ఓ ఎంపీగా, దుబ్బాక స్థానికుడిగా సురేఖను తన సోదరిగా భావించి దండ వేస్తే అసత్య ప్రచారానికి పాల్పడ్డారని, ఈ అసౌకర్యానికి చింతిస్తున్నానని రఘునందన్ అంటున్నారు. ఇక ఆనాడు దుబ్బాక సమావేశంలో ఉన్న ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి సైతం స్పందిస్తూ.. ఫొటోను దుష్ప్రచారం చేసిన వారిని శిక్షించాలన్నారు. ఈ వివాదం ముదురుతుందా.. సమసిపోతుందా అనే విషయం అంతుబట్టడం లేదు.

### హాట్‌టాపిక్‌గా దుబ్బాక

2020లో ఎమ్మెల్యేగా ఉన్న సోలిపేట రామలింగారెడ్డి అకాల మరణంతో తెరమీదకొచ్చిన ఉప ఎన్నికలు ఆనాడు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థిని కాదని బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావును గెలిపించడం నాడు సంచలనంగా మారి దుబ్బాక పేరు మార్మోగింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రచారం నిర్వహిస్తున్న కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి చేసిన ఘటన పెను సంచలనమైంది. మరోసారి దుబ్బాక పేరు వార్తల్లో నిలిచింది. ఆ ఎన్నికల్లో ప్రభాకర్‌రెడ్డి విజయం సాధించిన విషయం తెలిసిందే. ఇక తాజాగా దుబ్బాకలో కొండా సురేఖకు రఘునందన్‌రావు నూలు దండవేసిన ఫొటోపై రాద్ధాంతం నెలకొనడం, ఇది కాస్తా రాష్ట్రమంతటా రచ్చగా మారడం చర్చను లేవనెత్తినట్లయ్యింది. ఫలితంగా గడిచిన నాలుగేళ్లలో మూడోసారి దుబ్బాక పేరు మార్మోగుతున్నది.

## కార్యకర్తల కష్టంతోనే

# అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం

### టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

తూప్రాన్/మనోహరాబాద్/రామాయంపేట, అక్టోబరు 4: కార్యకర్తల కష్టంతోనే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధ్యమైందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. నిజామాబాద్ వెళ్తున్న ఆయనతో పాటు పాటు మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు శుక్రవారం మెదక్ జిల్లా పరిధిలోని మనోహరాబాద్, తూప్రాన్, రామాయంపేటలో పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లోని బంగారమ్మ ఆలయం వద్ద వారు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కార్యకర్తలతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అంతకుముందు వారికి నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. కాంగ్రెస్ మనోహరాబాద్ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నాగరాజుగౌడ్, బాలకృష్ణారెడ్డి, ఇర్ఫాన్, నరసింహాచారి, విఠల్‌రెడ్డి, రాజుయాదవ్, లక్ష్మీనరసింహగౌడ్, సుధాకర్‌రెడ్డి, గోపాల్, బాబుచారి పాల్గొన్నారు.



కాళ్లకల్ బంగారమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్

అనంతరం తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద వారిని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, తూప్రాన్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ గుప్తా, మున్సిపల్ వైస్‌చైర్మన్ శ్రీనివాస్, నాయకులు మహేందర్‌రెడ్డి, కృష్ణ, దేవేందర్ పాల్గొన్నారు. టీపీసీసీ చీఫ్, మంత్రికి రామాయంపేటలో టీపీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, నాయకులు రుద్రరాజు, చంద్రపాల్, ప్రభాకర్‌రెడ్డి, అమరసేనారెడ్డి, నజీరుద్దీన్ స్వాగతం పలికారు.



కాట్రియాలలో మహిళను సజీవదహనం చేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

# మనిషిని చంపుతుంటే సినిమాలా చూస్తారా?

- మీకు సంక్షేమ పథకాలు రాకుండా కలెక్టర్‌తో మాట్లాడుతా
- కాట్రియాల గ్రామస్థులపై మెదక్ ఎస్పీ ఆగ్రహం
- మహిళ సజీవదహనం ఘటనపై విచారణ
- పోలీసుల అదుపులో ఏడుగురు నిందితులు

రామాయంపేట, అక్టోబరు 4 : 'సాటి మనిషిని కళ్ల ముందే చంపుతుంటే సినిమా చూసినట్టు చూస్తారా? ఇదేనా మన నాగరికత? కలెక్టర్‌తో మాట్లాడి మీ ఊరికి సంక్షేమ పథకాలు, పెన్షన్లు రాకుండా చూస్తాను' అని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి కాట్రియాల గ్రామస్థులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం కాట్రియాలలో మంత్రాలు చేస్తుందన్న నెపంతో ఓ మహిళను గురువారం రాత్రి కొందరు సజీవ దహనం చేసిన ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. ఎస్పీతో పాటు డీఎస్పీ వెంకటరెడ్డి గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. అక్కడికి వచ్చిన గ్రామస్థులపై ఎస్పీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మూఢనమ్మకాలతో ఎదుటివారి ప్రాణాలు తీయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఇలాంటి దారుణం జరుగుతున్నప్పుడు తోటివారు స్పందించాలని సూచించారు. ఈ ఘటనకు బాధ్యులుగా గుర్తించిన ఏడుగురిని ఇప్పటివరకు అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. అలాగే, గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా పెద్దసంఖ్యలో పోలీసులు మోహరించారు.

### పార్శ్వనాథుడి విగ్రహం చోరీ కేసులో ఐదుగురి అరెస్టు



విగ్రహం చోరీ కేసులో అరెస్టు చేసిన నిందితులతో పోలీసులు

టేక్మాల్: రాత్రికి రాత్రే కోటీశ్వరులు కావలనే కలతో శతాబ్దాల పురాతనమైన విగ్రహాన్ని దొంగిలించిన యువకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం టేక్మాల్ పోలీస్‌స్టేషన్‌లో వివరించారు. మండలంలోని వెల్పుగొండలోని గుట్టపై జైనతీర్థంకుడు పార్శ్వనాథుడి విగ్రహాన్ని జులై 26న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చిలుకురి అనువింధ్, పోలిశెట్టి తేజసాయిబాబు, జొన్నలగడ్డ మహేష్‌బాబు, తోట జగత్, బందెల శుభానంద్ దొంగలించారు. బీటెక్ చదువుతున్న వీరు జల్సాలకు అలవాటు పడి డబ్బు కోసం ఈ విగ్రహాన్ని దొంగిలించారు. విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు.

# నిధులు వచ్చేనా? చింత తీరేనా?

- సంగారెడ్డి జీజీహెచ్‌లో సమస్యల తిష్ఠ
- పెచ్చులూడి.. ఉరుస్తున్న భవనాలు
- ప్రాంగణంలో పారుతున్న డ్రైనేజీ
- ఇటీవల ఆరోగ్య మంత్రి తనిఖీలు
- రూ.16 కోట్లతో వివిధ పనులకు ప్రతిపాదనలు
- మంజూరు కోసం ఎదురుచూపులు




డ్రైనేజీ పైపుల లీకేజీతో నాచు పట్టిన సంగారెడ్డి ఎంసీహెచ్ గోడలు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 4 : మెరుగైన వైద్య సేవలందిస్తున్న సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)ని పలు సమస్యలు వెంటాడుతున్నాయి. 200 పడకల జీజీహెచ్, 150 పడకల ఎంసీహెచ్ ఆస్పత్రిలో నిత్యం 1700 మంది ఓపీ ద్వారా వైద్య సేవలు పొందుతుండగా, సుమారు 350 మంది ఇన్‌పేషెంట్లతో ఎప్పుడూ నిండుగా ఉంటుంది. ఆస్పత్రి భవనాల్లో నెలకొన్న సమస్యలతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు.

### సమస్యలు ఇవిగో..

జీజీహెచ్ ఆస్పత్రి పాత భవనం కావడంతో శిథిలావస్థకు చేరుతూ వస్తున్నది. రెండేళ్ల కిందట వర్షం కురుస్తే నీరులోపలికి రావడం, గోడలు చెమ్మగిల్లడం వంటి సమస్యలను గుర్తించిన అప్పటి కలెక్టర్ డా.శరత్ మరమ్మతులు చేయించారు. వర్షం నీరు లోనికి రాకుండా స్లాబ్‌పై రేకులతో షెడ్లు వేయించి నీరు నిలవకుండా చేశారు. అయినప్పటికీ ఈ మధ్య కురిసిన భారీ వర్షాలకు ఆస్పత్రిలోని ఎంఎం, ఎఫ్ఎం వార్డులకు వెళ్లే దారిలో పైకప్పు కొంత పెచ్చులూడి నీరు కారడంతో రోగులు కొంత ఇబ్బందులు పడ్డ పరిస్థితి వచ్చింది. ఇక ఎంసీహెచ్ భవనం వెనక డ్రైనేజీ ఔట్‌ఫ్లో సమస్య తీవ్రంగా ఉంది. డ్రైనేజీ తరుచూ జామ్ అవడంతో దుర్గంధం వెదజల్లుతున్నది. అంతే కాకుండా బాత్‌రూమ్ పైప్‌లైన్‌ల నుంచి నీరు లీకు కావడంతో జీ+2 అంతస్థుల్లో ఉన్న ఎంసీహెచ్ గోడల నుంచి నీరు కారి నాచు ఏర్పడి భవనం కళావిహీనంగా దర్శనమిస్తున్నది. ఈ ఆస్పత్రిలో రోగులకు తాగునీరు సరిగ్గా అందడం లేదు. ఎంసీహెచ్ వద్ద ఉన్న రూపాయి నల్లా నీటితోనే రోగులు దాహార్తి తీర్చుకుంటున్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగుల సహాయకులు, బంధువులు కాసేపు సేదతీరుదామంటే నిలువనీడ లేదు. ప్రశాంతంగా కూర్చొని భోజనం చేద్దామంటే స్థలం లేదు. ఇక ఎంసీహెచ్‌లో ఉన్న ఒక్క లిఫ్ట్ ప్రస్తుతం సరిపోవడం లేదు. అది కూడా ఎప్పుడు బ్రేక్ డౌన్ అవుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. జీజీహెచ్‌తో పాటు ఎంసీహెచ్ భవనాలకు పలు రకాల మరమ్మతులు, ఆధునీకరణ చేయాల్సి ఉన్నది.



పెచ్చులూడిన జీజీహెచ్ పైకప్పు

### ప్రతిపాదనలు పంపినా మంజూరుకాని నిధులు

ఆగస్టు 8వ తేదీన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తనిఖీ చేశారు. అంతకుముందు ఫిబ్రవరి 13న కలెక్టర్ వల్లూరు క్రాంతి సందర్శించారు. ఈ క్రమంలో ఆస్పత్రి అధికారులు పలు రకాల సమస్యలను మంత్రితో పాటు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఎంఆర్ఐ, మరో సీటీ స్కాన్, టీఏల్ఎస్ వాహనాలతో పాటు ఆస్పత్రి భవనాల రిపేర్లు, పేయింటింగ్, వైద్య పరికరాల కొనుగోలు, లిఫ్ట్, ఓపెన్ డ్రైన్, పేషెంట్ అంటెండెంట్స్ షెడ్, ఆర్వో ప్లాంట్-డ్రింకింగ్ వాటర్, ఏసీలు, బయోకెమిస్ట్రీ ల్యాబ్ ఏర్పాటు తదితరాల అవసరమంటూ గుర్తించారు. ఈ నేపథ్యంలో సుమారు రూ.16 కోట్లతో టీజీఎంఎస్ఐడీసీ ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆగస్టు నెలలో ప్రభుత్వానికి నివేదించినట్లు అధికారులు తెలిపారు. వివిధ రకాల సమస్యలతో సతమతమవుతున్న ఈ తరుణంలో జీజీహెచ్‌కు నిధుల మంజూరు అత్యంత ఆవశ్యకం. ఈ క్రమంలో ఆస్పత్రి అధికారులు నిధులు విడుదల కోసం ఎదరుచూస్తున్నారు. నిధులు మంజూరైతేనే సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమై జీజీహెచ్‌కు మహర్దశ పట్టనుంది. ఇప్పటికైన జిల్లా మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సత్వర నిధుల మంజూరుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## బస్సు, కారు ఢీ.. ఇరువురికి గాయాలు



రోడ్డు పక్కకు దూసుకెళ్లిన కారు

నారాయణఖేడ్, అక్టోబరు 4 : నారాయణఖేడ్ - నిజాంపేట జాతీయ రహదారి 161బీ పై శుక్రవారం నారాయణఖేడ్ డిపోకు చెందిన బస్సు, కారు ఢీ కొన్నాయి. దీంతో కారు అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లగా ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని చికిత్స నిమిత్తం నారాయణఖేడ్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# బతుకమ్మ పూలు ఫుల్..

● ఉమ్మడి జిల్లా నలుమూలలకు ఇక్కడి నుంచే తరలింపు




నాగల్‌గిద్ద మండలం నుంచి గునుగుపూల తరలింపు



కోహిర్: వెంకటాపూర్ శివారులోని ఖామను చెరువు కట్ట కింద గునుగు వనం

నాగల్‌గిద్ద / నారాయణఖేడ్ / కోహిర్, అక్టోబరు 3: బతుకమ్మ పండుగ వచ్చిందంటే.. మొదటగా గుర్తుకొచ్చేది గునుగు పూలే. బతుకమ్మల తయారీలో ప్రధానంగా వీటినే వాడుతుంటారు. ఇవి ఎక్కువగా బీళ్ల భూముల్లో పెరుగుతుంటాయి. ఒకప్పుడు గ్రామాల్లో ఎక్కడ చూసినా ఈ పూలే కనిపిస్తుండేవి. ఇప్పుడు బీడు భూములు తగ్గి గునుగుపూలూ కనుమరగయ్యాయి. అయితే నాగల్‌గిద్ద, నారాయణఖేడ్, కోహిర్ మండలాలు మాత్రం గునుగుపూలకు అడ్డాగా ప్రసిద్ధిచెందుతున్నాయి. ఆ మండలాల్లోని పలు గ్రామాల్లో ఈ పూలు పుష్కలంగా లభిస్తున్నాయి. ఈ ప్రాంతాల నుంచి ఉమ్మడి మెదక్ జిల్లాతోపాటు కామారెడ్డి జిల్లావాసులు కూడా ఇక్కడి నుంచే గునుగు పూలను తీసుకెళ్తుంటారు.





ఖేడ్ నుంచి ఇతర ప్రాంతాలకు గునుగుపూల తరలింపు..

# వేర్వేరు ఘటనల్లో ఐదుగురి ఆత్మహత్య

**వేర్వేరు ఘటనల్లో వేరేవేరే కారణాలతో ఐదుగురు వ్యక్తులు ఆత్మహత్య చేసుకున్నారు. అప్పుల బాధలు, ఆర్థిక ఇబ్బందులతో ముగ్గురు, భార్య అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది ఒకరు, భూవివాదం కారణంతో మరో యువ రైతు ఆత్మహత్య చేసుకున్నారు.**

### ● అప్పులు తీర్చే మార్గం లేక..



మహేష్(ఫైల్)

కొండపాక, అక్టోబరు 4 : అప్పుల బాధతో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కొండపాకలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే కొండపాకకు చెందిన శ్రీరామ్ మహేష్ (38) సెలూన్ నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. ఇటీవల ఇల్లు నిర్మించుకుని గృహప్రవేశం కూడా చేశాడు. ఇల్లుకోసం చేసిన రూ.8లక్షల అప్పును ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురైన అతడు శుక్రవారం ఉదయం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పై ఫ్లోర్‌లో ఉన్న భార్య రమ కిందికి వచ్చి చూసేసరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే కిందికి దించి సిద్దిపేట ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కుకునూరుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ● ఆర్థిక ఇబ్బందులతో..



కృష్ణ(ఫైల్)

కొడిపల్లి, అక్టోబరు 4: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మ హత్య చేసుకున్న సంఘటన కొడిపల్లిలో శుక్రవారం జరిగింది. మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం మండల క్రేంద్రానికి చెందిన బర్ల కృష్ణ(44) సెంట్రింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువడంతో కొన్ని రోజులుగా తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం బయటకు వెళ్లివస్తానని చెప్పి వెళ్లిన అతడు ఎంతకీ తిరిగిరాలేదు. బంధుమిత్రుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా, శుక్రవారం గ్రామ శివారులో చెట్టుకు కృష్ణ మృతదేహం వేలాడుతూ కనిపించగా స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య శోభ ఫిర్యాదు మేరకు కొడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ● భార్య అనారోగ్యంతో విసుగుచెంది..



మహేష్(ఫైల్)

చిలప్‌చెడ్, అక్టోబరు 4: భార్య అనారోగ్యంతో విసుగు చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రమైన చిలప్‌చెడ్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చాకలి మహేష్(33) భార్య సావిత్రికి కొన్ని రోజులుగా ఆరోగ్యం బాగుండకపోవడంతో ఆమె తల్లిగారి గ్రామం కాదులూరులో ఉంటుంది. కాగా, మహేశ్ తన భార్య అనారోగ్యంపై తరుచూ బాధపడుతుండేవాడు. దీంతో మనస్తాపానికి గురైన అతడు శుక్రవారం మధ్యాహ్నం తమ పాలివారైన చాకలి చంద్రయ్య ఇంట్లోకి వెళ్లి గడియ పెట్టుకుని దూలానికి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతరు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాదగిరి తెలిపారు.

### ● అదృశ్యమైన పది రోజులకు చెరువులో శవమై..



లక్ష్మణ్ (ఫైల్)

అల్లాదుర్గం, అక్టోబరు 4 :ఓ వ్యక్తి అదృశ్యమైన పది రోజులకు చెరువులో శవమై తేలిన సంఘటన అల్లాదుర్గంలో చోటుచేసుకున్నది. స్థానిక ఎస్.ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఎంబరి లక్ష్మణ్ (23) కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పది రోజుల క్రితం దసరా పండగకు దుస్తులు కొనడానికి ఇంట్లో చెప్పి వెళ్లిన అతడు తిరిగిరాలేదు. కాగా, శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని పటేల్ చెరువులో వ్యక్తి మృతదేహం తేలిందని తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి పరిశీలించి లక్ష్మణ్‌గా గుర్తించారు. తన కుమారుడు ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### ● భూ వివాదంతో యువరైతు..


రామాయంపేట, అక్టోబరు 4: పాలివాళ్లతో ఉన్న భూ పంచాయతీ ఓ యువ రైతు ప్రాణం తీసింది. రెండు మూడేళ్లుగా ఐదు గుంటల పొలం విషయంలో గొడవలున్నాయి. ఈ విషయమై వారం క్రితం మరోమారు ఘర్షణ పడ్డారు. దీంతో ఆ భూమి తనకు ఇక దక్కదని భావించి మనస్థాపానికి గురై రామాయంపేట మండల పరిధి ఝాన్సీ లింగాపూర్ గ్రామానికి చెందిన ఎర్ర అశోక్ (25) చెట్టుకు ఉరివేసుకొని గురువారం రాత్రి బలవన్మరణం చెందాడు. కాగా శుక్రవారం అటుగా వెళ్లిన పలువురు చెట్టుకు వేలాడుతున్న శవాన్ని చూసి భార్య బాబాయ్‌కి సమాచారం ఇచ్చారు. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై బాలరాజ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రమాదవశాత్తు నీట మునిగి వ్యక్తి మృతి

సిద్దిపేట క్రైం, అక్టోబర్ 4 : చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్‌లో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నర్సాపూర్ కు చెందిన రెడ్డి మల్ల రాజు (34) ఈనెల రెండవ తేదీన రాత్రి 9 గంటలకు చేపల వేటకు వెళ్తానని ఇంట్లో చెప్పి వెళ్ళాడు. గురువారం ఇంటికి రాకపోవడంతో ఎంత వెతికిన ఆచూకీ లభించకపోవడంతో అతని తల్లి మల్లవ్వ టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. శుక్రవారం నర్సాపూర్ చెరువులో రాజు శవమై తేలడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రి మార్చురికి తరలించారు. మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అక్రమంగా ఎద్దు తరలింపు..

● అడ్డుకున్న బీజేపీ నాయకులు



చిన్నశంకరంపేట, అక్టోబరు 4 : చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని శుక్రవారం ఓ రైతు వద్ద దళారి ఎద్దును కొనుగోలు చేసి వాహనంలో అక్రమంగా తరలిస్తుండగా బీజేపీ నాయకులు అడ్డుకున్నారు. వివరాల్లో వెళ్తే ఓ ఎద్దును ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్నారని సమాచారం అందుకున్న బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఆకులు రాజు, నాయకులు స్వామి అక్కడికి చేరుకుని వాహనాన్ని అడ్డుకున్నారు. అనంతరం ఎద్దును తిరిగి రైతుకు అప్పగించారు. అక్రమంగా పశువులను తరలిస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు పశు సంపదను కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

# డిసెంబరు 1న మారథాన్

● ఐఐటీహెచ్ దరఖాస్తుల ఆహ్వానం



కంది, అక్టోబరు 4 : ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సాహించడానికి సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్‌లో డిసెంబరు 1న రన్నర్స్ హాఫ్ మారథాన్ 1వ ఎడిషన్‌ను నిర్వహించనున్నట్లు శుక్రవారం ఐఐటీహెచ్ అధికారులు ప్రకటన విడుదల చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాలు, నగరాల నుంచి ఫిట్‌నెస్ ఔత్సాహికులు, రన్నర్ల నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ రన్నర్స్ హాఫ్ మారథాన్‌లో పాల్గొనాలనుకునే వారు అక్టోబరు 31 వరకు ఐఐటీహెచ్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్లు నమోదు చేసుకోవాలని ఐఐటీహెచ్ అధికారులు సూచించారు. 600 ఎకరాల సువిశాలమైన ఐఐటీహెచ్ ప్రాంగణంలో డిసెంబరు 1న ఆదివారం ఉదయం 5 గంటలకు ఈ మారథాన్ ప్రారంభమవుతుంది. 5కే రన్, 10కే రన్, 21కే మారథాన్‌లతో పాటు ఫన్‌రన్ ఈవెంట్‌లు ఉంటాయి. విజేతలకు ప్రశంసా పత్రాలతో పాటు, పతకాలు, బహుమతులు ఉంటాయి. ఈ రన్నర్స్ హాఫ్ మారథాన్ అకాడమిక్ ఎక్సలెన్స్‌తో పాటు శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి ఆకాంక్షించారు.

# షూటింగ్ బాల్ పోటీల్లో మెరిసిన సంగారెడ్డి

● బాలురు, బాలికల విభాగాల్లో జిల్లాకు మొదటి బహుమతి

నారాయణఖేడ్, అక్టోబరు 4: రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో సంగారెడ్డి జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. నారాయణఖేడ్ శివార్లలోని ఈ తక్షిలా పాఠశాల ఆవరణలో నిర్వహించిన పోటీల్లో బాలుర, బాలికల రెండు విభాగాల్లోనూ సంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. క్రీడా పోటీలకు జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి హాజరై క్రీడాకారులను ఉత్తేజపరిచారు. కార్యక్రమంలో ఎస్జీఎఫ్ రాష్ట్ర సెక్రటరీ రాంరెడ్డి, రాష్ట్ర నాయకులు ఐలయ్య, పీఈటీల అసోసియేషన్ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

# తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసిన అశోక్‌కుమార్

● ఎమ్మెల్సీ కోదండరాం

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 4 : తెలంగాణ ఉద్యమంలో అశోక్‌కుమార్ చురుకుగా పాల్గొని ఉద్యమానికి ఊపిరి పోశారని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించిన విద్యాసదస్సు, ఆత్మీక కలయిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అశోక్‌కుమార్ ఉద్యోగ విరమణ అనతరం కూడా సామాజిక ఉద్యమాల్లో కొనసాగాలని కోరారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో అశోక్‌కుమార్ కీలకపాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ ఆర్. సత్యనారాయణ, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్, నర్సింహారెడ్డి, లక్ష్మీనారాయణ, నరసింహారెడ్డి, మనోహర్ రాజు, రఘునందన్, కొండల్‌రెడ్డి, వేణుగోపాల్, శ్రీనివాస్, ఎల్లయ్య, తిరుపతి, సంజీవయ్య, లక్ష్మయ్య యాదవ్, సోమశేఖర్, రాంచందర్, ప్రశాంత్, అశోక్, విజయ్‌భాస్కర్, నాసర్‌పటేల్, అశోక్‌కుమార్, బాబురావ్, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




కార్యక్రమంలో పాల్గొన్న ప్రొ. ఎమ్మెల్సీ కోదండరాం

## వివియో గ్లోబల్, హార్టికల్ యూనివర్సిటీ పరస్పర ఒప్పందం

ములుగు, అక్టోబరు 4: వివియో గ్లోబల్ సంస్థతో హైదరాబాద్ హార్టికల్చర్ యూనివర్సిటీ ఒప్పందం కుదుర్చుకుంది. శుక్రవారం మండల కేంద్రమైన ములుగులోని హార్టికల్చర్ యూనివర్సిటీలో రెండు సంస్థల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా హార్టికల్చర్ యూనివర్సిటీ ఉపకులపతి నీరజాప్రభాకర్ మాట్లాడుతూ వివియో గ్లోబల్ సంస్థతోపాటు వివిధ కంపెనీలతో కలిసి పని చేస్తామన్నారు. పంటల సాగులో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించి రైతులకు మేలు చేసేలా రెండు సంస్థలు ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ భగవాన్, రాజశేఖర్ రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా కానిస్టేబుల్ మృతి



చెన్నెశ్వరీ(ఫైల్)

నిజాంపేట, అక్టోబరు 4 : నాలుగు రోజుల క్రితం పండంటి కవలలకు జన్మనిచ్చిన మహిళా కానిస్టేబుల్ ఆరోగ్యం క్షీణించి మృతిచెందింది. నిజాంపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నారాయణఖేడ్ మండలం హంగిర్గ గ్రామానికి చెందిన చెన్నెశ్వరీ(25) ఏడాదిగా నిజాంపేట పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ మెటర్నరీ సెలవులో ఉన్నది. నాలుగు రోజుల క్రితం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రసవంకాగా ఇద్దరు కవలలు జన్మించారు. అనంతరం ఆమె ఆరోగ్యం క్షీణించడంతో చికిత్స పొందుతూ మృతి చెందింది. కానిస్టేబుల్ మృతిపై తోటి సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

## క్వారీ గుంతలో పడి వ్యక్తి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

నారాయణఖేడ్, అక్టోబరు 4: బట్టలు ఉతకడానికి వెళ్లి క్వారీ గోతిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం హంగర్గకె శివారులో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామ శివారులో కంకర క్రషర్ వాళ్లు రాళ్ల కోసం పలు చోట్ల తవ్వకాలు చేపట్టగా పెద్దపెద్ద గోతులు ఏర్పడగా వర్షపు నీటితో నిండాయి. ఈ క్రమంలో తమ గ్రామానికి చెందిన చాకలి హన్మంతు(50) గురువారం గోతుల్లో బట్టలు ఉతకడానికి వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి గల్లంతయ్యాడు. నీటిలో గాలించినా ఆచూకీ లభ్యంకాలేదు. అయితే శుక్రవారం ఉదయం మృతదేహం నీటిలో తేలింది. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

## గుండెపోటుతో ఉపాధిహామీ కూలీ మృతి



సత్తయ్య (ఫైల్)

మనోహరాబాద్, అక్టోబర్ 4: మండలంలోని కాళ్లకల్ గ్రామానికి చెందిన ఉపాధిహామీ కూలీ చీర్ల సత్తయ్యయాదవ్(56) గుండెపోటుతో మృతి చెందాడు. శుక్రవారం గ్రామ నర్సరీలో పని చేస్తుండగా గుండెపోటు రాగా చుట్టుపక్కలవారి సాయంతో మేడ్చెల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

# మా భూములకు మార్కెట్ విలువ చెల్లించాలి

● రెవెన్యూ అధికారులతో ఆర్ఆర్ఆర్ భూ బాధితుల మొర

● న్యాయం చేస్తాం:సంగారెడ్డి ఇన్‌చార్జి ఆర్డీవో రాజు

హత్నూర, అక్టోబరు 4: ట్రిపుల్ ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులతో శుక్రవారం హత్నూర రైతువేదికలో సంగారెడ్డి ఇన్‌చార్జి ఆర్డీవో రాజు సమావేశమయ్యారు. ఇదివరకే తమ భూముల్లో నుంచి కాళేశ్వరం కాలువ, హై టెన్షన్ లైన్‌తో భూములు కోల్పోయామని, మళ్లీ ఇప్పుడు ట్రిపుల్ ఆర్ కోసం భూములు తీసుకుంటే సర్వం కోల్పోతామని దేవులపల్లి రైతులు వాపోయారు. భూమికి భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌చార్జి ఆర్డీవో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ప్రాజెక్టులకు భూమికి భూమి, ప్రభుత్వ ఉద్యోగం వంటివి ఇవ్వడానికి వీలుపడదని రైతులకు సూచించారు. భూములు కోల్పోతున్న రైతులందరికీ తగిన విధంగా నష్టపరిహారం చెల్లించి సముచిత న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ పర్వీన్ షేక్, తహసీల్దార్ దాహుద్, ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

### రెడ్డిపల్లి రైతులు అవార్డు విచారణకు దూరం

నర్సాపూర్, అక్టోబరు 4: నర్సాపూర్ డివిజన్ పరిధిలో రెండోరోజు శుక్రవారం నిర్వహించిన ట్రిపుల్ ఆర్ బాధిత రైతులు అవార్డు విచారణ కు మండలానికి చెందిన మూసాపేట, నాగులపల్లి, చిన్నచింతకుంట, రెడ్డిపల్లి రైతులు పాల్గొనాల్సి ఉన్నది. అయితే రెడ్డిపల్లివాసులు పాల్గొనలేదు. ప్రస్తుత మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారంపై అందిస్తామని అధికారికంగా ప్రకటన ఇవ్వనందున విచారణకు రాలేదని ఆ గ్రామస్థులు తెలిపారు.

## ప్రజావాణి ఫిర్యాదుపై విచారణ


తిరుమలాయ చెరువు ప్రాంతాలను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్

జోగిపేట, అక్టోబరు 4: అందోలు పట్టణ శివార్లలోని తిరుమలాయ చెరువు ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌లను ట్రైనీ కలెక్టర్ చంద్రశేఖర్ శుక్రవారం పరిశీలించారు. ఈ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో పౌల్ట్రీ ఫార్మ్‌ను అక్రమంగా నిర్మించారంటూ అల్మాయి పేట వాసి మొగులయ్య గత సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సదరు నిర్మాణాలు అక్రమమా కాదా విచారణ జరుపమని, కలెక్టర్ క్రాంతి వల్లూరి ట్రైనీ కలెక్టర్‌ను ఆదేశించారు. ఈమేరకు, శుక్రవారం. ట్రైనీ కలెక్టర్ చంద్రశేఖర్.. తిరుమలాయ చెరువు వద్దకు చేరుకొని, పౌల్ట్రీఫాం నిర్మాణాలను ఆర్డీవో పాండు, డిప్యూటీ తహసీల్దార్ సాగర్ మధూకర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు.

## ప్రభుత్వ భూమిలో పరిశ్రమ నిర్మాణాలు

జిన్నారం, అక్టోబరు 4: గడ్డపోతారం పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూమిలో ఓ పరిశ్రమ అక్రమ నిర్మాణాలు చేపట్టిందని స్థానికులు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్థానిక సర్వే నెంబరు 10లో గల ప్రభుత్వ స్థలంలో ఓ పరిశ్రమ ప్రహరీ కోసం నిర్మాణాలు చేపట్టిందని, ఇటీవల స్థానికులు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేయగా పనులు నిలిపివేయాలని, భూములకు సంబంధించిన రికార్డులు అందజేయాలని ఈవో వెంకట్ సదరు పరిశ్రమకు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులకు సైతం సమాచారం ఇచ్చామని ఈవో తెలిపారు. కాగా పరిశ్రమ వారి ఆక్రమణల నుంచి విలువైన స్థలాన్ని కాపాడాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

## కలప వ్యాపారులకు నోటీసులు

శివ్వంపేట, అక్టోబరు 4: నిబంధనలకు విరుద్ధంగా భారీగా కలప డంపింగ్ దళారులకు వరంగా మారిందనే విషయమై గత నెల 22న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అటవీశాఖ రేంజ్ అధికారి స్పందించారు. మండల పరిధిలోని చండీ గ్రామంలో వందల టన్నుల కలపను కొనుగోలు చేస్తూ డంపు చేస్తూ అక్రమంగా తరలిస్తున్న విషయం ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. దీంతో స్పందించిన నర్సాపూర్ ఫారెస్ట్ రేంజ్ అధికారి అరవింద్ స్పందించారు. ఈ మేరకు బాధ్యులకు గత నెల 30న నోటీసులు జారీ చేసినట్లు శుక్రవారం తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా కలప డంపింగ్ చేసి రవాణా చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు

# వివిధ రూపాల్లో పూజలందుకుంటున్న దుర్గామాత


కల్హేర్‌లో మహంకాళి ఆలయంలో సామూహిక కుంకుమార్చన


సంగారెడ్డి రూరల్: ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో మహాలక్ష్మిగా అలంకరణ


రాయికోడ్‌లో ముమ్మాదేవి రాజరాజేశ్వరీదేవి అలంకరణలో దర్శనం


ఝరాసంగం: శ్రీకేతకీ ఆలయంలో గాయత్రీదేవిగా


పెద్దశంకరంపేట: తిరుమలాపూర్‌లో సామూహిక కుంకుమార్చన

**దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని మండపాల్లో కొలువుదీరిన దుర్గామాత ప్రతిమలు వివిధ రూపాల్లో దర్శనమిస్తూ భక్తుల పూజలందుకుంటున్నాయి. శుక్రవారం మహాలక్ష్మి, గాయత్రీ దేవి, రాజరాజేశ్వరీదేవి, దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారికి మండపాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమార్చనలు చేశారు.**

● సంగారెడ్డి రూరల్/కల్హేర్/నారాయణఖేడ్/రాయికోడ్/ఝరాసంగం/పెద్దశంకరంపేట, అక్టోబరు 4 : దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామంలోని సప్త ప్రాకారయుత శ్రీ దుర్గాభవాని మహాక్షేత్రంలో అమ్మవారు మహాలక్ష్మీ అవతారంలో కొలువుదీరి భక్తులచే పూజలందుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు గణపతి పూజ, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించగా, మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. కల్హేర్‌లోని మహంకాళీమాతా ఆలయ ఆవరణలో ప్రతిష్ఠించిన దుర్గామాతా ప్రతిమ వద్ద మహిళలు వేదపండితుడు గంగాధర్‌శర్మ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చనలు చేశారు. నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలోని దుర్గాభవానీ మాత ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాయికోడ్‌లోని ముమ్మాదేవి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఉదయం అమ్మవారిని అభిషేకం, కుంకుమార్చన, తదితర కార్యక్రమాలు వేదమంత్రాలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఝరాసంగంలోని శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దశంకరంపేట మండలకేంద్రంలోని తిరుమలాపూర్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

## గడిపెద్దాపూర్‌లో నాలుగు రోజులుగా నిలిచిన బ్యాంక్ సేవలు

అల్లాదుర్గం, అక్టోబరు 4 : సాంకేతిక లోపంతో అల్లాదుర్గం మండలంలోని గడిపెద్దాపూర్ గ్రామంలో గల సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో నాలుగు రోజులుగా లావాదేవిలు నిలిచిపోవడంతో శుక్రవారం ఖాతాదారులు బ్యాంక్ ముందు ఆందోళన చేపట్టారు. బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ప్రజలు షాపింగ్ అవసరాల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా అధికారులు సాంకేతికలోపం అంటూ సాకులు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంక్ ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, లేదంటే ఆందోళన చేపడతామని ఖాతాదారులు హెచ్చరించారు.


బ్యాంక్ వద్ద ఖాతాదారుల పడిగాపులు



బ్యాంక్ గేటుకు సిగ్నల్ లేదు అనే బోర్డు

## టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా నర్సాపూర్ బీజేపీ కౌన్సిలర్ సురేష్



నర్సాపూర్, అక్టోబరు 4: బీజేపీ సీనియర్ నాయకుడు, నర్సాపూర్ మున్సిపల్‌లో కౌన్సిలర్‌గా ఉన్న సురేష్‌ను జిల్లా టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా నియమించారు. ఈ సందర్భంగా శుక్రవారం సురేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి న్యాయం చేసేందుకు తన శక్తిమేరకు కృషి చేస్తానన్నారు.

## టెలికాం బోర్డు సభ్యుడు బాల్‌చందర్‌కు సన్మానం

చేగుంట, అక్టోబరు 4: మండలంలోని రెడ్డిపల్లి మాజీ సర్పంచ్ మంద బాల్‌చందర్ మెదక్ జిల్లా టెలికాం బోర్డు సభ్యుడిగా నియమితులైన సందర్భంగా స్థానిక అర్‌అండ్‌బీ గెస్టుహౌజ్‌లో మెదక్ పార్లమెంట్ బీజేపీ ఎస్సీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి కొండిస్వామి, చేగుంట మండల అధ్యక్షుడు చింతాల భూపాల్ శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గోవింద్, వెంకటేష్, సిద్దిరాంలు ఉన్నారు.

## దసరాకు ప్రత్యేక బస్సులు

నారాయణఖేడ్, అక్టోబరు 4: దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని నారాయణఖేడ్ డిపో నుంచి ఈ నెల 5 నుంచి 14 వరకు 15 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు స్థానిక డీఎం మల్లేశయ్య అసిస్టెంట్ డీఎం నర్సింలు లు శుక్రవారం తెలిపారు. నారాయణఖేడ్ నుండి పటాన్‌చెరు, లింగంపల్లి మీదుగా సంగారెడ్డి, జోగిపేట, పెద్దశంకరంపేట వరకు ప్రత్యేక బస్సులు నడుపుతామని, ప్రత్యేక బస్సుల్లో 25 శాతం అదనపు చార్జి వసూలు చేయనున్నట్లు తెలిపారు. ఏదైనా సమస్యలుంటే 7382800834,7382830800 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

## పార్ట్ టైం అధ్యాపకుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

నాగల్‌గిద్ద, అక్టోబరు 4: మండల పరిధిలోని కరస్‌గుత్తి గిరిజన బాలికల గురుకుల కళాశాలలో తాత్కాలికపద్ధతిన(పార్ట్‌టైం)వివిధ సబ్జెక్టుల్లో ఆంగ్ల బాషలో బోధించుటకు అర్హులైన మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఇంద్రజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూ ఈనెల 21న రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ రీజినల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

## కమ్యూనిటీ హాల్‌కు భూమి పూజ

రామాయంపేట, అక్టోబర్ 4: పట్టణంలోని పెద్దమ్మ గుడి ప్రాంగణంలో రూ.10 లక్షల వ్యయం కాగల కమ్యూనిటీహాల్ పనులకు ఎమ్మెల్సీ షేర్ సుభాష్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భూమి పూజ చేశారు.

## పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

మునిపల్లి, అక్టోబరు 4: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో డాక్టర్ హరినందన్ రావు అన్నారు. ఫ్రైడే, డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని ఖమ్మంపల్లి గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో అండాలమ్మ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

● చిలప్‌చెడ్: గ్రామంలోని వీధులన్ని ఎప్పటి కప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని డీపీవో యాదయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చిట్యుల్ గ్రామ పంచాయతీని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి పల్లె ప్రకృతి వనం, సెగ్రిగేషన్‌షెడ్డు డంపింగ్ యార్డులను పరిశీలించారు.

## ఫీల్డ్‌అసిస్టెంట్ల కమిటీ ఎన్నిక

మునిపల్లి, అక్టోబరు 4: మండలంలోని ఆయా గ్రామాలకు సంబంధించిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల మండల నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా అంతారం గ్రామానికి చెందిన ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా ఉల్లాస్ (బుదేరా), ప్రధాన కార్యదర్శిగా సంజీవులు (కల్లపల్లి- బేలూర్), కోశాధికారిగా కృష్ణ (పిల్లోడి)లను ఎనుకున్నారు. సభ్యులుగా విజయ్ కుమార్, విశ్వనాథం, ఏసయ్య చంద్రయ్య, మంజుల, సుజాత, ప్రవీణ్, మల్లేశం,రాజేందర్‌లను ఎన్నుకున్నారు.

## తపస్ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలిగా రేఖ

చేగుంట, అక్టోబరు 4: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మెదక్ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలిగా చేగుంట జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు బాల్‌శెట్టి రేఖ ఎన్నికయ్యారు. శుక్రవారం తపస్ మెదక్ జిల్లా అధ్యక్షకార్యదర్శిలు జిడ్డి ఎల్లం, వల్లా లక్ష్మణ్, లు అమెకు నియామక పత్రం అందజేశారు.

# ఒక కుటుంబానికి ఒకే డిజిటల్ కార్డు


మెదక్‌లో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు


సదాశివపేటలో ఫ్యామిలీ డిజిటల్ సర్వేను పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

మెదక్ అర్బన్/నర్సాపూర్/చిన్నశంకరంపేట, అక్టోబరు4: ఒక కుటుంబానికి ఒక డిజిటల్ కార్డును అందజేయనున్నట్లు మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు ఫతేనగర్‌లో పైలెట్ ప్రాజెక్టుగా నిర్వహిస్తున్న డిజిటల్ కార్డు ఇంటింటి సర్వేను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలో 289 కుటుంబాలు లక్ష్యంగా నాలుగు బృందాలు విడిపోయి సర్వే చేస్తున్నట్లు చెప్పారు. పారదర్శకంగా సర్వే కొనసాగుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం పైలట్ ప్రాజెక్టులో భాగంగా నర్సాపూర్‌లోని 8వ వార్డు, మండలంలోని గొల్లపల్లిలో 2వ రోజు శుక్రవారం అధికారులు ఇంటింటి సర్వే చేశారు. సర్వేలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో మాధవిలత ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించారు.చిన్నశంకరంపేట మండలంలోని కామారం గ్రామంలో శుక్రవారం కొనసాగిన సర్వేను తహసీల్దార్ మన్నన్, ఎంపీడీవో దామోదర్ పరిశీలించారు.

### సంగారెడ్డి జిల్లాలో..

సదాశివపేట/జహీరాబాద్/నారాయణఖేడ్, అక్టోబరు 4: సదాశివపేట మున్సిపల్ పరిధిలో జరుగుతున్న ఫ్యామిలీ డిజిటల్ సర్వేను శుక్రవారం సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి పరిశీలించారు. సర్వే విధానంపై కలెక్టర్ స్థానిక తహసీల్దార్ కెసరస్వతి, మున్సిపల్ కమిషనర్ జె.ఉమాలకు పలు సూచనలు చేశారు. జహీరాబాద్‌లోని శాంతినగర్‌లోని 10వవార్డులో ఇంటింటి డిజిటల్ సర్వే ప్రక్రియను తహసీల్దార్ రవీందర్ పరిశీలించారు. మొగుడంపల్లి మండలంలోని గౌసాబాద్‌లో నిర్వహించిన సర్వేలో ఎంపీడీవో మహేష్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. నారాయణఖేడ్ మున్సిపాలిటీపరిధిలోని 3వ వార్డులో ప్రత్యేక అధికారుల బృందం సర్వే చేపట్టింది. శుక్రవారం ఈ సర్వే తీరును ఆర్డీవో అశోక చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ ఛైర్మన్ దారం శంకర్, తహసీల్దార్ భాస్కర్ సర్వేను పరిశీలించారు. వార్డులోని పలు గృహాలకు తిరిగి అధికారులు సర్వే చేస్తున్న తీరును పరిశీలించారు.

## ముమ్మరంగా బీజేపీ సభ్యత్వ నమోదు

నిజాంపేట, అక్టోబరు 4: దేశం కోసం ధర్మం కోసం ప్రతి ఒక్కరూ సమాజ సేవ చేసి దేశభక్తి చాటాలని మెదక్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పంజా విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో శుక్రవారం బీజేపీ సభ్యత్వనమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో మల్లన్న కమాన్ కోసం ఇచ్చిన హామీ మేరకు రూ.1,01,111 కమిటీ సభ్యులు గ్రామ ప్రజల సమక్షంలో అందజేశారు. అనంతరం పంజా విజయ్‌కుమార్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

● చిన్నశంకరంపేట: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మురళీధర్, మెదక్ జిల్లా బీజేపీ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి, మెదక్ పార్లమెంట్, అసెంబీ కన్వీనర్ రామ్‌మోహన్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల బీజేపీ అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ఉపాధి పనులపై సమీక్ష

చిన్నశంకరంపేట, అక్టోబరు 4: మండల కేంద్రంలో శుక్రవారం ఉపాధి హామీ పనులపై మెదక్ డీఆర్‌వో శ్రీనివాస్ రావు ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టిన పనులు రికార్డులలో ఎలా పొందు పరచాలనే విషయంపై దిశ నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్, ఎంపీవో గిరిజారాణి, ఏపీవో లక్ష్మీనారాయణ, టీఏలు పాల్గొన్నారు

# గిరిజన సంక్షేమానికి అధిక ప్రాధాన్యం: ఎంపీ


నారాయణఖేడ్: భోగ్ భండార్‌లో ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, పీఠాధిపతి సంగ్రాం మహారాజ్

నారాయణఖేడ్, అక్టోబరు 4: గిరిజనుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తుందని జహీరాబాద్‌ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడి పేర్కొన్నారు. మండలంలోని వెంకటాపూర్ క్రాస్‌రోడ్స్ వద్ద సంత్ తపస్వీ రాంరావు మహారాజ్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం బంజారా సేవాలాల్ సంఘం ఆధ్వర్యంలో భోగ్ భండార్, సేవాలాల్ జెండా ఆవిష్కరణ, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివంగత ఇందిరా గాంధీ హయాం నుంచి నేటి వరకు కాంగ్రెస్ గిరిజనులకు అండగా ఉందన్నారు. రాంరావు మహారాజ్ ట్రస్టుకు ప్రభుత్వపరంగా ఎలాంటి సహకారమైనా అందిస్తామన్నారు. కార్యక్రమంలో అఖిల భారత సాధుసంతులరాష్ట్ర ప్రతినిధి, కొండాపూర్ ఆశ్రమపీఠాధిపతి సంగ్రాం మహారాజ్, సేవాలాల్‌సంఘం రాష్ట్ర నాయకులు రమేష్ చౌహాన్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

మనూరు, అక్టోబరు 4: మనూరు మండలకేంద్రంలో నాఫెడ్ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సోయాబీన్‌కు ప్రభుత్వం మద్దతు ధరగా రూ.4,892లను నిర్ధారించినట్టు చెప్పారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మేనేజర్ ఆంజనేయులు, నాయకులు సిద్దారెడ్డి, రైతులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

# కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి: ఎమ్మెల్యే చింతా

సదాశివపేట, అక్టోబరు 4: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ పేదలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చాలని, ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ప్రజల తరపున కోరుతున్నానని బీఆర్‌ఎస్ సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తెలిపారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను కాంగ్రెస్ అమలు చేసి తీరుతుందని టీజీఐఐసీ ఛైర్మన్ నిర్మల జగ్గారెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. శుక్రవారం సదాశివపేట పట్టణంలో నెం. 34వ రేషన్ షాప్ ఆవరణలో నిర్వహించిన మహాలక్ష్మి పథకం ద్వారా రూ.500కే వంట గ్యాస్ పత్రాలను లబ్ధిదారులకు అందజేసే కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతాప్రభాకర్, టీజీఐఐసీ ఛైర్మన్ తూర్పు నిర్మలాజగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ రైతులు రుణమాఫీ 40 శాతం మేరకే జరిగిందన్నారు. కాంగ్రెస్‌పేదల పక్షాన పేదలకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలన్నారు. టీజీఐఐసీ ఛైర్మన్ తూర్పు నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీని కాంగ్రెస్ అమలు చేసిందన్నారు. టెక్నాలజీ లోపం కారణంగా కొంత మందికి రుణమాఫీ కాలేదని, త్వరలో రాష్ట్రంలో రైతులందరికీ పూర్తిస్థాయిలో రుణమాఫీ జరిగి తీరుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, టీజీఐఐసీ ఛైర్మన్ నిర్మలాజగ్గారెడి మహిళలకు మహాలక్ష్మి పథకం రూ.500కే వంట గ్యాస్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీడీసీ ఛైర్మన్ గడీల రాంరెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ అపర్ణ శివరాజ్‌పాటిల్, వైస్ ఛైర్మన్ చింతా గోపాల్, మున్సిపల్ కమిషనర్ జె.ఉమా, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుకు మహాలక్ష్మి పథకం పత్రాలను అందజేస్తున్న చింతా ప్రభాకర్, నిర్మలాజగ్గారెడ్డి

## బాలికల కళాశాలలో బతుకమ్మ వేడుకలు


జూనియర్ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న నిర్మలారెడ్డి

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 4 : సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు చక్కగా బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. ముఖ్య అతిథిగా టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలారెడ్డి హాజరై బతుకమ్మ ఆడి వారిలో ఉత్సాహం నింపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, మున్సిపల్ ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి, కౌన్సిలర్ వనిత, లెక్చరర్లు, పాల్గొన్నారు.

## తూప్రాన్‌లో అట్ల బతుకమ్మ


తూప్రాన్‌లో బతుకమ్మ అడుతున్న మహిళలు

తూప్రాన్, అక్టోబరు 4: తూప్రాన్ పట్టణంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకుంటున్నారు. తూప్రాన్ పట్టణంలోని మహంకాళి ఆలయం వద్ద శుక్రవారం అట్ల బతుకమ్మ పురస్కరించుకొని స్వేత (తెలుపు) వర్ణం చీరలు కట్టుకొని బతుకమ్మ ఆటలు ఆడారు.

## సద్దుల బతుకమ్మ ఏర్పాట్ల పరిశీలన

పటాన్‌చెరు, అక్టోబరు 4: ఈ నెల 10వ తేదీన జరుపుకునే సద్దుల బతుకమ్మ సంబురాలను నిర్వహించేందుకు పటాన్‌చెరు సాకిచెరువు కట్టపై జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. బతుకమ్మ ఘాట్ వద్ద ప్రముఖ గాయకులతో సంగీత విభావరి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే వెంట డిప్యూటీ కమిషనర్ సురేష్ ఉన్నారు.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు

చిలప్‌చెడ్, అక్టోబరు 4: తెలంగాణ సంస్కృతికి బోనాలు. బతుకమ్మ పండుగలు ప్రతీకలని ఎమ్మెల్యే సునితారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సొమ్ల తండాలో నిర్వహించిన బోనాల జాతరలో ఆమె పాల్గొన్నారు. సేవాలాల్, భవాని మాత సన్నిధిలో ఆమె పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యూత్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కోహీర్ హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా విక్రమ్ సింహారెడ్డి

కోహీర్, అక్టోబరు 4: సార్వజనిక హిందూ ఉత్సవ కమిటీ కోహీర్ పట్టణ నూతన కమిటీ ఎన్నుకున్నట్లు ఆ కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ అధ్యక్షుడిగా గడ్డమీద విక్రం సింహారెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా రాచూరి కనుక రత్నం, ఉపాధ్యక్షులుగా అల్లోల్ శ్రీనివాస్, లగ్గేరి జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శిగా ముక్క శ్రీనివాస్, కార్యదర్శులుగా నాగారపు యాదవులు, మద్దూరి జగదీశ్వర్, కోశాధికారిగా పట్నం మాణిక్యం, కార్యనిర్వహణ సభ్యులుగా కుమ్మరి నర్సింహులు, ఎరుకలి అశోక్, చరణ్‌గౌడ్, శ్రీధర్ చారి, కమ్మరి పవన్‌కుమార్, చాకలి శివశంకర్, హస్నాబాద్ నాగరాజు, పోతనగారి శ్రీనివాస్, మ్యాదరి వెంకటేష్, ముఖ్య సలహా దారులుగా రాచురి చంద్రశేఖర్, ప్రభుగారి శాంత్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

## దివ్యాంగులకు న్యూట్రిషన్ ఫుడ్ పంపిణీ

నారాయణఖేడ్, అక్టోబరు 4: నారాయణఖేడ్ పరిధిలోని మండల కేంద్రమైన నిజాంపేటలో నవోదయ స్కూల్ సెంటర్ ఆధ్వర్యంలో 55మంది దివ్యాంగులకు శుక్రవారం న్యూటిషన్‌ఫుడ్, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ లుక్ మాట్లాడుతూ తమ సంస్థ ఎలాంటి రుసుము లేకుండా దివ్యాంగులకు చేయూతనందిస్తుందన్నారు. పండగ సమయంలో ప్రతి దివ్యాంగుడు ఆనందంగా ఉండాలనే, ఆలోచనతో న్యూట్రిషన్ ఫుడ్, దుస్తులను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అర్నాల్డ్ అనాథ ఆశ్రమ ప్రిన్సిపాల్ ఆల్విన్, సంగారెడ్డి జిల్లా ఆనిమేటర్ భాస్కర్, నిజాంపేట మాజీ సర్పంచ్ జగన్‌చారి, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి, నాయకులు రాంచందర్ రావు, మక్బూల్, పోచయ్య, తదితరులుపాల్గొన్నారు.

## బస్సు, కారు ఢీ.. మహిళ మృతి

● ఇద్దరికి తీవ్ర గాయాలు

కల్హేర్, అక్టోబరు 4: సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని మునిగేపల్లి శివారులో శుక్రవారం ఆర్టీసీ కారు, బస్సు ఢీకొన్న సంఘటనలో ఓ మహిళ మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా రేగోడు మండల పరిధిలోని గజ్వాడ గ్రామానికి చెందిన భూమవ్వ(55), భర్త దుర్గయ్య, కూతురు స్వరూప, మరో వ్యక్తి పాపయ్యతో పాటు ఇద్దరు పిల్లలతో కలిసి నారాయణఖేడ్‌లో బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి హైదరాబాద్ నుంచి కారులో బయలుదేరారు. అదే సమయంలో ఖేడ్ డిపోకు చెందిన లగ్జరీ బస్సు హైదరాబాద్ వైపునకు వెళ్తూ.. మునిగేపల్లి గ్రామ శివారులో నారాయణఖేడ్, నిజాంపేట రహదారిపై మూల మలుపు వద్ద కారు, బస్సు ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో భూమవ్వ అక్కడికక్కడే మరణించగా, ఆమె భర్త, మరో వ్యక్తి పాపయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి: డీఎస్పీ


పోస్టర్లను విడుదల చేస్తున్న పోలీసులు, విద్యార్థులు

జహీరాబాద్, అక్టోబరు 4: సమాజంలో యువత చెడువ్యసనాలకు దూరంగ ఉండాలని మాదకద్రవ్యాల నిరోధకశాఖ డీఎస్పీ పుష్పరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని జాగృతి డిగ్రీకళాశాలలో మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులంతా ఇష్టంతో చదువుకోవాలన్నారు. ఆనంతరం పలు పోస్టర్‌లను వారు విడుదల చేశారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ కాశీనాథ్, పోలీసులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి: డీఈవో

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 4 : ఓపెన్ స్కూల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో వెంకటేశ్వర్లు సూచించారు. సంగారెడ్డిలోని జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాగా రెండో రోజు ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నిర్వహించిన ఇంటర్మీడియట్ ఆంగ్లం పరీక్షకు 112 మంది హాజరుకాగా, 34 మంది గైర్హాజరయ్యారు. అదే విధంగా ఎస్ఎస్‌సీ ఐసీహెచ్ పరీక్షకు 11 మంది హాజరు కాగా నలుగురు గైర్హాజరయ్యారైనట్టు డీఈవో తెలిపారు. కాగా ఓపెన్ స్కూల్ అడ్మిషన్ గడువును ఈ నెల 31 వ తేదీ వరకు పొడగించినట్టు డీఈవో వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్ణీత అపరాధ రుసుముతో ఈ నెలాఖరు వరకు చెల్లించాలని సూచించారు. వివరాలకు జిల్లా కోఆర్డినేటర్ వెంకటస్వామి 8008403635 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

## తుల్జాభవానీమాతను దర్శించుకున్న పులిమామిడి రాజు


పులిమామిడిరాజుకు జ్ఞాపికను అందజేస్తున్న కమిటీ బాధ్యులు

సదాశివపేట, అక్టోబరు 4: విజయదశమి- శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, పీఎంఆర్ డెవలపర్స్, పీఎంఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ పులిమామిడి రాజు శుక్రవారం మహారాష్ట్రలోని తుల్జాపూర్ గ్రామంలో స్వయంభూగా వెలసిన తుల్జాభవానిమాతను తన మిత్ర బృందంతో కలసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పులిమామిడిరాజు మాట్లాడుతూ.. సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం తుల్జాభవాని ఆలయ కమిటీ పులిమామిడిరాజును ఘనంగా సన్మానించి, అమ్మవారి జ్ఞాపికను అంజేసింది.

## 'సహారా' ఉచిత వైద్య శిబిరానికి స్పందన

వట్‌పల్లి, అక్టోబరు 4: వట్‌పల్లిలోని వెంకటఖ్వాజా దర్గా ఫంక్షన్‌హాల్‌లో సంగారెడ్డిలోని సహారా ఇన్‌క్లూజీవ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆస్పత్రి న్యూరో ఫిజీషియన్ డా.ధీమంత్‌రెడ్డి, గైనకాలజిస్టు డా.శ్రేయాదేశాయ్‌ల సమక్షంలో వట్‌పల్లి గ్రామస్థులతో పాటు చుట్టు పక్కల గ్రామాలవారు సుమారు 150 మంది వరకు ఉచితంగా వైద్య సేవలు పొందినట్లు సహారా ఆస్పత్రి ఎండీ మఠం శంకర్ తెలిపారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు, స్థానికులు ఉన్నారు.

## ప్రయాణికులకు సేవలందించడంలో ఆర్టీసీ ముందంజ

జహీరాబాద్, అక్టోబరు 4: ప్రయాణికులకు సేవలందించడంలో ఆర్టీసీ ఎప్పుడూ ముందుంటుందని మెదక్ రీజినల్ మేనేజర్ ప్రభలత పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆర్టీసీడిపోమేనేజర్ జాకీర్‌హుస్సేన్‌తో మాట్లాడి డిపోకు సంబంధించిన పూర్తివివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. బస్టాండ్ ఆవరణలో ఆమె మొక్కలను నాటారు. ఆనంతరం ఆర్టీసీ ఉద్యోగులతో కలిసి షటిల్ ఆడారు. డిపోలోని వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలందిస్తున్న పలువురు ఉద్యోగులను ఘనంగా సన్మానించారు.

## పెన్షన్ కోసం ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేయాలి

నర్సాపూర్, అక్టోబరు 4: పట్టణంలోని పెన్షన్ దారులు పోస్టాఫీసు వద్ద ప్రతి నెలా డబ్బుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని స్థానిక మున్సిపల్, పోస్టాఫీసు అధికారులకు ఎమ్మెల్యే సునీతారెడ్డి సూచించారు. శుక్రవారం నర్సాపూర్‌లోని 8వ వార్డులో పర్యటించిన సందర్భంగా పైలట్‌ప్రాజెక్టు కింద ఫ్యామిటీ డిజిటల్ కార్డు కోసం నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా అదేవార్డులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు పౌష్టికాహారం అందుతున్న తీరును పరిశీలించారు. పోస్టాఫీసు వద్ద పెన్షన్ కోసం ఉన్న వారి వద్దకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ ఛైర్మన్ అశోక్‌గౌడ్, కమిషనర్ రామకృష్ణరావు, మేనేజర్ మధుసుదన్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## అర్బన్ పీహెచ్‌సీ ఏర్పాటుకు స్థల పరిశీలన

తూప్రాన్, అక్టోబరు 4: తూప్రాన్ పట్టణానికి మంజూరైన ఆరు పడకల అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం తూప్రాన్ డబుల్ బెడ్ రూంల వద్ద సర్వేనంబరు 325లో కేటాయించిన స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఆరోగ్యశాఖకు అనుకూలంగా మార్పులు చేర్పులు చేసి భూమిని చూపించినట్లు వివరించారు. త్వరలో నిర్మాణం ప్రారంభం కానుందని ఇంజనీరింగ్ అధికారులు వివరించినట్లు తెలిపారు. ఆర్డీవో వెంట మున్సిపల్ కమిషనర్ ఖాజా మొహిజోద్దీన్, ఇన్‌చార్జి తహసీల్దారు ప్రభుదాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, డీఈఈ, పీహెచ్‌సీ వైద్యాధికారి ఉన్నారు.

## సీజనల్ వ్యాధులతో జాగ్రత్త: జడ్పీ సీఈవో

తూప్రాన్, అక్టోబరు 4: సీజనల్ వ్యాధులబారిన పడకుండా ప్రజలు జాగ్రత్త పడాలని జడ్పీ సీఈవో ఎల్లయ్య సూచించారు. మండలంలోని వట్టూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన డ్రైడే ఫ్రైడే కార్యక్రమం పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషాద్రి, ఏపీవో సంతోష్‌రెడ్డి, కార్యదర్శి సురేష్, ప్రజలు పాల్గొన్నారు.

## యోగా ద్వారా మానసిక ప్రశాంతత: ఎమ్మెల్యే

పటాన్‌చెరు, అక్టోబరు 4: యోగా నిత్యజీవితంలో భాగం కావాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణా యోగాసన స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో పటాన్‌చెరు ముదిరాజ్ భవన్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి యోగా పోటీలను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుంచి హాజరైన విద్యార్థుల యోగా ప్రదర్శన ఆకట్టుకుంది.

## అన్ని రంగాల్లో ముదిరాజ్‌లు అభివృద్ధి సాధించాలి

చేగుంట ,అక్టోబరు 4: ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడం హర్షణీయమని చేగుంట మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బెదరబోయిన నాగభుషణం అన్నారు. చేగుంట గెస్టుహౌజ్‌లో శుక్రవారం ఒకే కుటుంబంలో ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన నరేందర్, కరుణాకర్, నవిత, తోపాటు నూతనంగా టెలికం బోర్డు సభ్యులుగా నియామకమైన రెడ్డిపల్లి మాజీ సర్పంచ్ మంద బాల్‌చందర్‌లను చేగుంట మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.